ఘనంగా బోనాల ఉత్సవాలు



దర్బార్ మైసమ్మ ఆలయంలో ఈపీఎఫ్ కమిషనర్ డాక్టర్ శివకుమార్

కాచిగూడ: బర్కత్‌పురలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో బర్కత్‌పుర ఈపీఎఫ్ కమిషనర్ -1 డాక్టర్ శివకుమార్, మాదాపూర్ కమిషనర్ -1 సౌరవ్ జగతి, ఆలయ కమిటీ చైర్మన్ పెంద్యాల రాంబాబు, డి.గోపాల్‌గౌడ్, ఆర్.సురేష్, పీవీఎస్ ప్రసాద్, అఖిలేష్‌రెడ్డి, మనోజ్ జాదవ్‌లతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని బంగారు ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి బోనం సమర్పించారు. డివిజన్ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రఘుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ దంపతులు హాజరయ్యారు. బీజేపీ నేతలు శ్రీకాంత్, ఉమేష్, నర్సింగ్‌రావు, సురేందర్, సంయుక్తరాణి, సాయికుమార్, ఆనంద్‌రావు, రవియాదవ్, అభిషేక్, ప్రశాంత్, డేవిడ్, సతీష్ పాల్గొన్నారు.

శివయ్య దేవాలయంలో..

నల్లకుంట: నల్లకుంట పాత రామాలయం వీధిలోని భవాని శివయ్య దేవాలయంలో అమ్మవారికి బోనం సమర్పించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఇందిర పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు మల్లేష్, శ్యామ్‌యాదవ్, హనుమంతరావు, శోభ పాల్గొన్నారు.

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో రేణుకాఎల్లమ్మ ఆలయంలో నగర గ్రంథాలయం సంస్థ ఉద్యోగులు బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, పౌరగ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీనివాస్‌చారి మాట్లాడారు. అనంతరం లైబ్రరీ ఆవరణలో టీఎన్‌జీఓ మాజీ అధ్యక్షులు దేవీప్రసాద్, ప్రస్తుత హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మజీబ్, కార్యదర్శి విక్రమ్‌లు మొక్కలు నాటారు. నగర కేంద్రగ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి, కార్యదర్శి పద్మజ, గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, సభ్యులు పెంటారెడ్డి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అయోధ్య, నగర ప్రధాన కార్యదర్శి బొల్లం మహేందర్, పెన్నర్ల రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్, సోమ శివయ్య, బుచ్చయ్య, నగర గ్రంథాలయ సంస్థ కార్యవర్గ సభ్యులు వెంకటేష్‌యాదవ్, మదన్‌మోహన్, కృష్ణారెడ్డి, రామ్మోహన్, సుఖేష్‌కుమార్, శ్రీనివాసులు, హరిబాబు, వరప్రసాద్, నరేందర్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ దంపతులు



బోనం ఎత్తుకున్న లైబ్రరీ చైర్‌పర్సన్ ప్రసన్నరామ్మూర్తి

క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి ఆలయంలో వైభవంగా జరిగే బోనాల వేడుకలకు హాజరు కావాల్సిందిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానపత్రాన్ని మంగళవారం ఆయన నివాసంలో అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు జ్ఞానేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, కె.దుర్గప్రసాద్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, మల్లికార్జున్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, సుధాకర్, గిరిధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

14న త్రిష్య రాఘవన్ కర్ణాటక సంగీత గానగోష్ఠి

చిక్కడపల్లి: యువ ప్రతిభా ప్రోత్సాహం కింద వంశీ ఇంటర్నేషనల్ ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగ సప్తస్వరమ్‌తో కలిసి 14న త్యాగరాయగానసభలో యువ గాయని త్రిష్య రాఘవన్ కర్ణాటక గాన గోష్ఠి నిర్వహిస్తున్నట్లు వంశీ రామరాజు, రాజ్యలక్ష్మి ప్రకటించారు. భారత్‌కు చెందిన త్రిష్య అమెరికాలో పౌరసత్వంలో అక్కడ ఉత్తర కరోలినాలో విద్యను అభ్యసించి ప్రమీల రాణి శిక్షణలో శాస్త్రీయ సంగీతం నేర్చుకుంటున్నారన్నారు. ఆమె తల్లిదండ్రులు సమంత రాఘవన్, శ్రీనివాస్‌రాఘవన్‌లు సంగీత అభిమానులు ఆనాటి కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ గాయని శ్రీనిధి తిరుమల, వయోలిన్ కళాకారుడు అశోక్ గురజాలే పాల్గొంటారని వివరించారు.

సబ్బండ కులాల రాజ్యస్థాపనే లక్ష్యం



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

కాచిగూడ: తెలంగాణలో సబ్బండ కులాల రాజ్యస్థాపనే ఏకైక లక్ష్యంగా ధర్మ సమాజ్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మంగళవారం బర్కత్‌పురలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు రాఘవేంద్ర, అబ్దుల్ రెహమాన్, లక్ష్మణ్, శివన్‌మహరాజ్, అంజయ్య, వినోద్ యాదవ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

16,17న నింబోలిఅడ్డాలో బోనాల ఉత్సవాలు



కాచిగూడ: నింబోలిఅడ్డా మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 16,17 తేదీల్లో జరిగే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాజేందర్ పటేల్ గౌడ్ తెలిపారు. మంగళవారం నింబోలిఅడ్డలో సుభాష్ పటేల్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆయన ప్రకటించారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

లాలాపేట: ఇంటిగ్రేటెడ్ 5 సంవత్సరాల కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ డిమాండ్ చేస్తూ మంగళవారం ఓయూ పాలనా భవనం ఎదుట విద్యార్థులు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... ఇదే అంశంపై గత 4 నెలల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణం అన్నారు. ఒక వైపు విద్యాశాఖా మంత్రి, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఈ ఇంటిగ్రేటెడ్ కోర్సు వల్ల చాలా ఉపయోగాలున్నాయని చెప్తున్నారని , మరో వైపు ఓయూ వైస్ చాన్సలర్ ఈ కోర్సు రద్దుకు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీని కోసం ఓయూ వీసిని కలువడానికి వచ్చిన విద్యార్థులను వీసి కలువడానికి అనుమతి ఇవ్వకపోవడంతో చేసేదేమి లేక పాలనా భవన్ గేటు వద్ద విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

187 ఆలయాలకు.. రూ.93.55 లక్షల చెక్కులు



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు

ముషీరాబాద్: తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ దేవుని తోటలోని భవానీశంకర ఆలయంలో నియోజకవర్గంలోని 187 అమ్మవారి దేవాలయాలకు బోనాల ఉత్సావాల నిర్వహణ కోసం రూ. 93.55 లక్షల విలువైన చెక్కులను ఆలయ కమిటీ నిర్వాహకులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, పావనీవినయ్‌కుమార్, రచనశ్రీలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బోనాల ఉత్సవాలను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయాల వద్ద ప్యాచ్‌వర్క్స్, మట్టి కుప్పల తొలగింపు, విద్యుత్ దీపాల ఏర్పాటు, నీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకులు రెబ్బ రామరావు, నవీన్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, కె.మాధవ్, ఆరు డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు నర్సింగ్‌ప్రసాద్, శ్రీనివాస్‌రావు, ఆర్.మోజెస్, రాకేష్, శ్యామ్‌యాదవ్, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, ముషీరాబాద్ మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వాలు

సీపీఎం నేత బీవీ రాఘవులు ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న బీ.వీ.రాఘవులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాల కంటే అంతర్జాతీయ పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్ల వ్యాపార ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీ.వీ. రాఘవులు ఆరోపించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ స్థానిక సంస్థల సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ తాజా ఆదేశాలపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ.. నగర అభివృద్ధి ప్రణాళికలు అన్ని ప్రజల అవసరాల కోసం కాకుండా ఎన్నికల అవసరాలను బట్టి నిధులు విడుదలవుతున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న నగరాల్లోని సివరేజీ నిర్వహణ, తాగునీటి సరఫరా వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే కుట్రలు ప్రభుత్వం చేస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో భూముల రేట్లు పెరిగాయని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మిగులు భూములను పేదలకు ఎందుకు పంచడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే పద్ధతుల్లో పట్టణ ప్రణాళికల్లో సంస్కరణలు, మున్సిపల్‌లో ఆర్థిక సంస్కరణలు అమలు చేసే నగరాలకే నిధులు ఇస్తామని కేంద్రం ప్రకటించడం అప్రజాస్వామికం అన్నారు. ప్రొఫెసర్ నర్సింహ్మారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీ.జీ.నర్సింహ్మారావు, సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ్, ఎం.శ్రీనివాస్‌రావు, ఎస్.మారన్న, ఎం.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి



అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకుని సేవా కార్యక్రమాలను పెంపొందించాలని హ్యుమెన్ రైట్స్ కమిషన్ అడ్వకేట్ దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలో కందూరు కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలు, ఉన్నత ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడం ద్వారా అందరికీ మేలు జరుగుతుందని తెలిపారు. సమాజహితం కోసం పనిచేసే వారికి ఎప్పుడూ.. మేలు జరుగుతుందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కందూరి కృష్ణ, పారిశ్రామికవేత్త ప్రమోద్‌అగర్వాల్, అడ్వకేట్స్ హెచ్.గోవింద్‌రావు, కె.కౌశిక్, వారాలిని తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ఆర్టీసీక్రాస్‌రోడ్స్ జవహర్‌నగర్‌లోని శ్రీ వరాల పోచమ్మ దేవాలయంలో ఆలయ ఆరో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ఎ.కనకరాజు, ప్రధాన కార్యదర్శి ఎల్.ఏసురత్నం, కోశాధికారి శ్రీరాములు, సలహాదారు నిరంజన్ పర్యవేక్షణలో గణపతి పూజ, నవగ్రహ పూజ, పోచమ్మతల్లికి దుర్గ హోమం, కుంకుమార్చన నిర్వహించారు. కాగా నేడు అమ్మవారి కల్యాణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం



ఎన్.గౌతంరావు

కాచిగూడ: పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం, పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. పేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ మంజూరు చేయకపోవడంపై ఆయన ప్రశ్నించారు. వర్షాకాలంలో ఇళ్లలోకి వరద వచ్చి పేదలు అనేక అవస్థలు పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. కేంద్రం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

వృద్ధుడిని చేరదీసిన హెల్పేజ్ ఇండియా సంస్థ

లాలాపేట: ఎవరూ లేని ఓ వృద్ధుడిని హెల్పేజ్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఓయూ పోలీసుల సహకారంతో చేరదీసిన సంఘటన మంగళవారం ఓయూ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... అలహాబాద్‌కు చెందిన అక్బర్(65) ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌పై ఉంటున్నాడు. ఇది గమనించిన ఓ విద్యార్థి హెల్పేజ్ ఇండియా సంస్థకు సమాచారం అందించారు. దీంతో ఆ సంస్థ ప్రతినిధి ఎం. సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని ఓయూ పోలీసుల సహకారంతో హెల్పేజ్ ఇండియా సంస్థలో చేర్పించారు. పూర్తి వివరాల కోసం 18001801253 హెల్ప్ లైన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'సన్న, చిన్నకారు రైతులపై రేవంత్‌రెడ్డి విద్వేషం'

చాదర్‌ఘాట్: మూడెకరాల రైతులకు మూడు పూటల కరెంట్ చాలని సన్న, చిన్నకారు రైతులపై రేవంత్‌రెడ్డి విద్వేషం చిమ్ముతూ వ్యాఖ్యానించారని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అమెరికా పర్యటనలో ఎన్‌ఆర్‌ఐల సమావేశంలో రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలు కాంగ్రెస్ పార్టీ విధాన నిర్ణయాలుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. మొన్న ధరణి ఎత్తివేత ప్రకటన, అంతకు ముందు రైతు బీమా రద్దు, నిన్న ఉచిత కరెంట్, రేపు సంక్షేమ పథకాల రద్దు... ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణను సర్వనాశనం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం తప్పక గుణపాఠం చెప్తుందని వాసుదేవరెడ్డి అన్నారు.

వార్డు కార్యాలయాల్లో సేవలపై... ప్రజలకు అవగాహన కల్పించాలి

లాలాపేట: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇటీవల అందుబాటులోకి వచ్చిన వార్డు కార్యాలయాల్లో లభించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులకు సూచించారు. వార్డు కార్యాలయాల్లో ఫిర్యాదు రిజిస్ట్రేషన్ పద్ధతులు, అక్కడ అందించే శాఖల వివరాలు తదితర అంశాలతో రూపొందించిన కరపత్రాన్ని మంగళవారం తన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ... ఈ కరపత్రాలను ప్రతి ఇంటికి చేరేలా చేయాలన్నారు. వార్డు కార్యాలయాల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. 8 విభాగాల అధికారులు వార్డు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఫిర్యాదుల కోసం ఫోన్: 90104 02909ను సంప్రదించాలన్నారు. డీఈ సువర్ణ, ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మిస్బా, శానిటేషన్ సూపర్‌వైజర్ యాదగిరి పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్

కాచిగూడ: కుటుంబ నియంత్రణపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మంగళవారం మ్యాడం అంజయ్య హాల్‌లో ఆయన మాట్లాడారు. దేశ జనాభా 143 కోట్లకు చేరి ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా అవతరించిందన్నారు. జనాభా పెరుగుదల దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. జనాభా పెరుగుతూ పోతే భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ముఖ్యంగా ఆహార సమస్య, ఆరోగ్య సమస్యలు ఎదురౌతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

● జనాభా నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి దాకా 9 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామని మరో 6 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరామన్నారు. రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, జిల్లా మీడియా అధికారులు ఎస్.శ్రీనివాస్‌రావు, నాగరాజు, వెంకటేశ్వర్, మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టీబోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

దివ్యాంగులకు నోట్‌బుక్స్ పంపిణీ..

అంబర్‌పేట: దివ్యాంగులకు ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద భవసార్ క్షత్రియ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నోట్‌బుక్స్, బ్యాగులు, టిఫిన్‌బాక్సులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేయూతనిస్తోందన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అశ్వినికుమార్, ఇతర ప్రతినిధులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న నర్సింగ్‌ముదిరాజ్

ముషీరాబాద్: వేలాది మంది ఎలక్ట్రీషియన్లు జీవనోపాధి కోసం పనులు చేసుకుంటూ కటుంబాలను పోషించుకుంటున్నారని ఆర్థికంగా వెనుకబడిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్‌ముదిరాజ్ కోరారు. మంగళవారం ముషీరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో విద్యుత్ సృష్టికర్త నికోలెస్‌టెస్లా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎలక్ట్రీషియన్లు ఐక్యంగా ఉన్నప్పుడే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఎలక్ట్రీషన్‌లకు తెల్లరేషన్‌కార్డులు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, హెల్త్‌కార్డులు అందజేయాలన్నారు. త్వరలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి, కమిషనర్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని విన్నవిస్తామన్నారు. అసోసియేషన్ నాయకులు ఎ.శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, బాబు, శ్రీకాంత్, వేణు, రాము, ప్రభాకర్, వినోద్, బాబురావు, కృష్ణారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యతో ప్రజలకు అవస్థలు



ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: డివిజన్‌లో తాగునీటి సరఫరా సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ ఆనంద్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబర్‌పేట డివిజన్‌లో తాగునీటి సరఫరా సరిగ్గా లేదని కలుషిత నీరు సరఫరా అవుతోందని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెజార్టీ ప్రాంతాల్లో తాగునీరు సరిగ్గా సరఫరా కాకపోవడంతో సామాన్యులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిత్యం తాగునీటి సరఫరాను అరికడుతున్నామని అధికారులు, ప్రజా ప్రతినిధులు చేస్తున్న ప్రకటనలకు వాస్తవాలకు ఎక్కడా పొంతన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం నీటి సరఫరా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆయన కోరారు.

'మున్నూరుకాపు కార్పొరేషన్' ఏర్పాటు చేయాలి

కాచిగూడ: మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమానికి రూ.5వేల కోట్లతో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ బలహీన వర్గాల సమితి, మున్నూరుకాపు సంఘం సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 12 న బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్నూరుకాపు సంఘం నేత ఉగ్గే శ్రీనివాస్ పటేల్ ప్రకటించారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ నుంచి తొలగించి మున్నూరుకాపులకు అప్పగించాలని తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులకు ప్రత్యేకంగా 10శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనందున తప్పనిసరి పరిస్థితుల్లో 'చలో కలెక్టరేట్ ముట్టడి'కి పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్విమ్మర్ క్వీని విక్టోరియాకు అభినందన



అభినందిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్

కాచిగూడ: అంతర్జాతీయ స్మిమ్మింగ్ పోటీల్లో క్వీని విక్టోరియా రెండు రజత పతకాలను సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. ఈజిప్ట్ దేశ రాజధాని కైరోలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ అండర్ వాటర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బర్కత్‌పురకు చెందిన క్వీని విక్టోరియా ప్రతిభ కనబరిచి రెండు రజత పతకాలను సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో మంగళవారం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అంజనేయగౌడ్ ఆమెను అభినందించి ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సీఎం కేసీఆర్ ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కడతారు: దేప



కొత్త మనోహర్‌రెడ్డి, పాండురంగారెడ్డిలను సన్మానం చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మహేశ్వరం ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి కొత్త మనోహర్ రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి మంగళవారం దేప భాస్కర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని దేప భాస్కర్‌రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాబోయే రోజుల్లో అందరం కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ధనరాజ్ గౌడ్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుళ్ళ శివ ప్రసాద్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాటి రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.